క్లుప్తంగా

మీసేవ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సతీశ్

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్‌కు చెందిన మీసేవ నిర్వాహకుడు ఊరడి సతీశ్ తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యాడు. హైదరాబాద్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో సతీష్‌కు ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు బైర శంకర్, ప్రధానకార్యదర్శి అబ్దుల్ మోహిదీలకు కృతజ్ఞతలు తెలిపాడు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా ఎగవేతపై నేడు ఆదివారం మండల కేంద్రంలో ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించనున్నందున విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిర్వహించే ధర్నా కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రా మ శాఖ అధ్యక్షులు, రైతు బంధు సమితి నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సంఘం వార్షికోత్సవం

చిల్పూరు: మండల కేంద్రంలో గీత కార్మిక సంఘం భవనం ముందు కార్మిక సంఘం 67వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు గసగోని రమేశ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. గ్రామ సంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, విజయ భాస్కర్, రాములు, వెంకన్న, సట్ల లింగయ్య, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

సీడ్ బాల్స్ పంపిణీ

కొడకండ్ల : స్థానిక టీజీఆర్‌ఎస్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దారం షణ్ముఖప్రియ శనివారం తన జన్మదినం సందర్భంగా సీడ్‌బాల్స్‌ను కళాశాలకు అందజేసింది. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై తన ఆసక్తితో వినూత్న ఆలోచన సృజనాత్మకతతో 150 రకాల మొక్కల విత్తనాలను సేకరించి సీడ్‌బాల్స్ తయారు చేసి కళాశాల ప్రాంగణంలో పెంచేందుకు తల్లిదండ్రులు దారం మధు -గాయత్రిల సహకారంతో ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్‌కు అందజేసింది.

సింగరేణి ఎస్‌సీసీఎల్ పీఎంగా ఉదయ్‌కుమార్

రఘునాథపల్లి : మండల కేంద్రానికి చెందిన కొయ్యడ లక్ష్మి- ప్రభాకర్ల ప్రథమ కుమారుడు ఉదయ్‌కుమార్ సింగరేణి ఎస్‌సీసీఎల్ పర్సనల్ మేనేజర్‌గా శనివారం ఎంపికయ్యాడు. ఉదయ్‌కుమార్ పదో తరగతి వరకు స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ట్రిపుల్‌ఈ, ఘట్‌కేసర్ విజ్ఞాన భారతిలో బీటెక్ ట్రిపుల్ ఈలో ప్రథమ స్థానం సంపాదించాడు. నిజాంకాలేజీలో ఎంబీఏ పూర్తి చేసి ఇటీవల సింగరేణి ఆల్ ఇండియా కంపెనీ ఎగ్జామ్ రాసి పర్సనల్ మేనేజర్‌గా ఎంపికయ్యాడు.

మార్కెట్ చైర్మన్ పదవి బీసీ ‘ఏ’ కు ఇవ్వాలి



జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని రిజర్వేషన్ ప్రకారం బీసీ‘ఏ’కు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌కు సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ఆధ్వర్యాన వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన రిజర్వేషన్ల ప్రకారం ఈసారి బీసీఏకు చైర్మన్ అవకాశం కల్పించాల్సి ఉండగా అధికారులు రిజర్వేషన్ల హక్కులను ఉల్లంఘించారన్నారు. దీనిపై కలెక్టర్ విచారణ చేయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సభ్యులు రాపర్తి రాజు, బూడిది గోపి, ధర్మ భిక్షం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బచ్చన్నపేట : స్థానిక శివాలయం వీధిలో 1 క్వింటా50 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన శనివారం జరిగింది. ఎస్సై ఎస్‌కే హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని విచారించగా ఇక్కడ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారని అన్నారు. వారు యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడేనికి చెందిన భూక్య నాగేష్, మూడావత్ దుర్గాప్రసాద్ అని అన్నారు. రెండు ద్విచక్ర వాహనాలపై రేషన్‌బియ్యం కొనుగోలు చేస్తుండగా పట్టుకున్నామని వాహనాలను స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

వైభవంగా వారకల్యాణం

చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరాలయంలో శనివారం అర్చకులు స్వామివారికి వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ మోహన్‌బాబు ఆధ్వర్యంలో హన్మకొండకు చెందిన చల్ల రాంచంద్రారెడ్డి, విజయ చందర్‌రెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు.

రైతు వేదిక ఇలా.. సమావేశాలు ఎలా ?

మద్యం ప్రియులకు అడ్డాగా మారిన పరిస్థితి



రాజవరంలోని రైతు వేదిక



పగులగొట్టిన తలుపు, కిటికీ గ్లాస్

చిల్పూరు: మండలంలోని రాజవరం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న రైతు వేదికకు చెందిన తలుపులు, కిటికీలు పగుల గొట్టి మద్యం ప్రియులు అడ్డాగా మార్చుకున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులు సమావేశాలను నిర్వహించుకునేందుకు క్లస్టర్ల వారిగా రైతు వేదికలను నిర్మించింది. అందులో సంబంధిత అధికారుల కోసం రెండు గదులు, రైతులు సమావేశాలను నిర్వహించుకునేందుకు హాలుతో పాటు సౌకర్యాలు కల్పించారు. వంగాలపల్లి, నష్కల్, చిన్నపెండ్యాల, రాజవరం గ్రామాలను క్లస్టరుగా చేసి రాజవరంలో రైతు వేదికను నిర్మించారు. ఇందులో రైతులతో పాటు వివిధ సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుకూలంగా ఉండేది. ఇటీవల గుర్తుతెలియని కొందరు వ్యక్తులు తలుపులు, కిటికీలు పనికి రాకుండా పగుల గొట్టారు. విషయం తెలుసుకున్న క్లస్టర్ ఏఈఓ వినయ్‌కుమార్ ఉన్నతాధికారులకు తెలియజేసి అందులోని ఉన్న ఫ్యాన్లు, కుర్చీలు మరోచోట పెట్టించాడు. తిరిగి సమావేశాలు నిర్వహించుకోవాలంటే మరమ్మతులకు చాలా ఖర్చవుతుందని రైతులు గ్రహించాలన్నారు.

పంటలను దళారులకు విక్రయించొద్దు

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



బచ్చన్నపేట : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట/తరిగొప్పుల : రైతులకు, ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా నేరుగా నాకు కలిసినా, ఫోన్ చేసినా స్పందిస్తానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొడవటూర్‌లో, తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారంలో ఏకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను దళారులకు విక్రయించకూడదని అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. చేర్యాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నల్లనాగుల శ్వేత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీఠ వేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఎం వినత, మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, చెంద్రారెడ్డి, ఏపీఎం నాగేశ్వర్‌రావు, నాయకులు వెంకటాచారి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్, మసూద్, పింగిళి జగన్మోహన్‌రెడ్డి, తెలంగాణ సీడ్స్ మాజీ డైరెక్టర్ అర్జుల సంపత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తాళ్లపల్లి అనితారాజేశ్వర్‌గౌడ్, చిలువేరు లింగం, ఎల్లయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు



జనగామ : సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ నాయకులు

జనగామ : జిల్లా కేంద్రంలోని గ్రేయిన్ మార్కెట్ ఏరియా సబ్‌స్టేషన్‌తో పాటు వీవర్స్‌కాలనీలో శనివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో పార్టీ అత్యధిక సభ్యత్వాలు కలిగి ఉందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే యువత స్వచ్ఛందంగా బీజేపీలో చేరాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సానబోయిన సతీష్, సంతోష్, హరీష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ముందుండాలి

బచ్చన్నపేట : పార్టీ సభ్యత్వ నమోదులో అన్ని పార్టీల కంటే ముందంజలో ఉండాలని బీజేపీ జిల్లా కార్యదర్శి దరావత్ రాజు నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి అధ్యక్షతన చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు ప్రతీ కార్యకర్త పని చేసి ఒక్కో బూత్‌లో 200 సభ్యత్వాలను చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బేజాడి సిద్దులు, నాయకులు గణేష్, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



జనగామ: వెంకటేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ : పట్టణంలోని 21వ వార్డు బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి బాల్దె వెంకటేష్ ఇటీవల మృతి చెందగా శనివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. వెంకటేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి, ఆర్థిక సాయం చేశారు. వెంకటేష్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

బచ్చన్నపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మండలంలోని లక్ష్మాపూర్‌లో ఇమ్మడి బాలస్వామి భార్య మృతి చెందగా, కట్కూర్‌లో మూసిని శ్రీనివాస్ కుటుంబ సభ్యులను, వంగ సుదర్శన్‌రెడ్డి నగర్‌లో నక్కల పిట్టల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలియా చిట్టిబాబు భార్య శాంతమ్మ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురికి ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయన వెంట నాయకులు బావండ్ల కృష్ణంరాజు, నూకల నర్సిరెడ్డి, కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి, శివరాత్రి రాజనర్సు, మూసిని రాజు, స్వామి, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాయే ధ్యేయం

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎన్‌పీడీసీఎల్ స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ రాంబాబు అన్నారు. మండలంలోని శివునిపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన శనివారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ తగిన సలహాలు, సూచనలు అందించారు. విద్యుత్‌శాఖలో ఫీల్డ్ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండా లన్నారు. ఆయన వెంట ఏఈ శివకుమార్, లైన్‌ఇన్‌స్పెక్టర్ పెద్దిరెడ్డి, లైన్‌మెన్‌లు గబ్బెట సుధాకర్, లక్‌పతి, ఏఎల్‌ఎం రాము, వెంకటేష్ ఉన్నారు.

ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలి



రఘునాథపల్లి : మహిళలు పొదుపుకు పరిమితం కాకుండా ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని మాదారంలో నవభారతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు చెందిన 40 మంది సభ్యులకు 25 చొప్పున పెరటికోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రగతి గ్రామైఖ్య సంఘ ప్రతినిధి రజిత నిర్వహించే మదర్ యూనిట్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్,ఏపీఎం సారయ్య, సీసీలు వీఓఎలు పాల్గొన్నారు.

కస్తూర్బా హాస్టల్‌లో పునర్విచారణ

రఘునాథపల్లి : రెండేళ్ల కిందట విధుల నుంచి తొలగించబడిన ముగ్గురు ఉద్యోగులు కోర్టును ఆశ్రయించడంతో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పునర్విచారణ చేపట్టారు. మండలంలోని ఖిలాషాపూర్ కస్తూర్బా బాలికల హాస్టల్‌లో 2022లో ఉపాధ్యాయులుగా పని చేసిన కల్పన, హేమలతతోపాటు ఏఎన్‌ఎం మౌనిక విధుల పట్ల తప్పిదాలు తేలినందున అప్పటి కలెక్టర్ ఆ ముగ్గురిని విధుల్లో నుంచి తొలగించారు. ఈ విషయమై ఆ ముగ్గురు కోర్టును ఆశ్రయించడంతో తిరిగి విచారణ చేపట్టి వాస్తవిక నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. వీరి వెంట జీసీడీఓ గౌసియాబేగం, ఎంఈఓ రఘునందన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, ప్రత్యేకాధికారి సునిత పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హామీలు విస్మరించిన ప్రభుత్వాన్ని నిలదీద్దాం

రఘునాథపల్లి : ఆసరా పింఛన్లు పెంచుతామని, ఇలా ఎన్నో హామీలు ఇచ్చి విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీద్దామని దివ్యాంగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిర్రు నగేష్‌లు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన వీహెచ్‌పీఎస్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆసరా పింఛన్లు పెంచే వరకు ఐక్య ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలన్నారు.

హైదరాబాద్‌కు తరలిన సోషల్‌మీడియా ప్రతినిధులు

జనగామ: హైదరాబాద్ గాంధీభవన్‌లో శనివారం రాష్ట్ర కో ఆర్డినేటర్ పెట్టెం నవీన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జనగామ జిల్లా నుంచి సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు వెళ్లారు. జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దాసరి క్రాంతి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సోషల్ మీడియా ముందుండి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. రెడ్డబోయిన మహేష్, అందె నాని బాబు, చింతల రమేష్, నవాజ్, శ్రీనివాస్, రాకేష్ పాల్గొన్నారు.

ఏఓకు స్వాగత సన్మానం

దేవరుప్పుల : మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన బజ్జూరి దివ్యను ఫెర్టిలైజర్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్వాగత సన్మానం చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఫెర్టిలైజర్ డీలర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నడిదె సీతారామిరెడ్డి, ఉపాధ్యక్షులు ఉమేష్, కార్యదర్శులుగా చంద్రప్రకాష్, నర్సింగరావు, సహాయ కార్యదర్శిగా ఉమేష్, కోశాధికారిగా పాము శ్రీధర్, కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

పనిచేసే వారికే గుర్తింపు

కొడకండ్ల : పార్టీ శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసే ప్రతీ ఒక్కరికి కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ అన్నారు. జనగామ మార్కెట్ చైర్మన్‌గా నియామకమైన శివరాజ్‌యాదవ్‌ను యూత్ నాయకులు సన్మానం చేశారు.


తృటిలో తప్పిన ప్రమాదం

చిల్పూరు: చిల్పూరుగుట్టకు చెందిన పంతం రాజ్‌కుమార్ శనివారం సాయంత్రం భారీ వర్షానికి తోడు ఒక్కసారిగా పిడుగు పడడంతో తృటిలో తప్పించుకున్నాడు. రాజ్‌కుమార్ పనినిమిత్తం వెళ్లగా వర్షం మొదలు కావడంతో ఇంటికి తిరిగి వస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో అతనికి కొద్ది దూరంలో తాటి చెట్టుపై పిడుగు పడింది. ఒక్కసారిగా వణికిపోయిన అతనికి 5 నిమిషాల పాటు చెవులు వినిపించలేదు. తేరుకున్న అతను మాట్లాడుతూ ఒక్కసారిగా తనకు షాక్ తగిలినట్లు అనిపించిందన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

జఫర్‌గఢ్ : విద్య ద్వారానే మనిషి మహోన్నత వ్యక్తి అవుతాడని దుర్గం మల్లయ్య వెల్ఫేర్ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ దుర్గం సూరయ్య అన్నారు. మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు సుమారు రూ.6 వేల విలువ చేసే పుస్తకాలను సొసైటీ ద్వారా ఆయన శనివారం అందజేశారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నేత హఠాన్మరణం



సుభాష్‌చందర్‌రెడ్డి (ఫైల్)

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత, రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు లింగాల సుభాష్‌చందర్‌రెడ్డి (60) శనివారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్‌చందర్‌రెడ్డి సోదరుడైన సుభాష్‌చందర్‌రెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, సింగపురం ఇందిర, జంగా రాఘవరెడ్డి, పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కళామహోత్సవ్‌లో సంజన ప్రతిభ

కొడకండ్ల : జనగామలో నిర్వహించిన జిల్లా స్థాయి కళామహోత్సవ్ పోటీల్లో స్థానిక టీజీఆర్‌ఎస్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న టి.సంజన్ ప్రతిభ చాటి ప్రథమ బహుమతిని గెలుపొందింది. ఆమె రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.

సమస్యల పరిష్కారానికి కృషి

చిల్పూరు : గ్రామంలోని గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామ గౌడ సంఘం నూతన అధ్యక్షుడు టీవీ రాజు గౌడ్ అన్నారు. మండలంలోని వెంకటాద్రిపేటలో శనివారం గౌడ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షుడు టీవీ రాజు, ఉపాధ్యక్షుడు తాడగోని ఉదయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రవీందర్, కార్యదర్శి రాజు, కోశాధికారి సురేష్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

కొడకండ్ల : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సంధ్య కోరారు. శనివారం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ పంచాయతీ వాటర్ మెన్‌లకు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ శిక్షణలో వివరించిన మెళకువలను పాటించాలని సూచించారు.

కమిటీలు రద్దు చేయాలంటూ దీక్షలు

జఫర్‌గఢ్: ఇందిరమ్మ కమిటీలు ఏకపక్షంగా నియమించడాన్ని నిరసిస్తూ మాజీ జెడ్పీటీసీ పట్టపూరి సదయ్యగౌడ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలు శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీలను తక్షణమే రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు.

రైతులను విస్మరిస్తే పుట్టగతులుండవ్

బచ్చన్నపేట : రైతులే దేశానికి వెన్నెముక అని అలాంటి రైతులను విస్మరించిన ప్రభుత్వాలకు పుట్టగతులుండవని బీఆర్‌ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు వడ్డెపల్లి ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

విద్యార్థికి సన్మానం

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ విద్యార్థి దిలీప్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికై నందుకు సన్మానించినట్లు పాఠశాల హెచ్‌ఎం బాలకిషన్‌రావు తెలిపారు.

కమిటీల్లో అన్ని పార్టీలకు చోటు ఇవ్వాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



మాట్లాడుతున్న మోకు కనకారెడ్డి

జనగామ రూరల్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో అన్ని రాజకీయ పార్టీలకు అవకాశం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. పట్టణంలోని ఏసీరెడ్డి నగర్‌లో శనివారం సీపీఎం శాఖ మహాసభలు నిర్వహించారు. పట్టణ కమిటీ సభ్యులు పందిళ్ళ కల్యాణి, పల్లెర్ల లలిత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన కనకారెడ్డి ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీల పేరుతో ఇతర పార్టీలకు అవకాశం ఇవ్వకుండా సొంత పార్టీ కార్యకర్తలను కమిటీలలో చేర్చడం సరైన పద్ధతి కాదన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు అవకాశం కల్పించి అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా జాబితాలు తయారు చేయాలన్నారు. ఇళ్లు లేని వారికి స్థలాలు అందించి నిర్మాణానికి రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, నాయకులు బూడిద గోపి, జోగు ప్రకాష్, విజేందర్, ఉపేందర్, లింగం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి



చిల్పూరు : సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

జఫర్‌గఢ్/రఘునాథపల్లి/చిల్పూరు : రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటు పడుతున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఐకేపీ కేంద్రం ఆధ్వర్యంలో జఫర్‌గఢ్ మండలంలోని తిమ్మంపేట, రఘునాథపల్లి మండలం కంచనపల్లి, చిల్పూరులో, చిల్పూరు మండలం రాజవరంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పంటలు పండించిన రైతులకు మద్దతు ధర లభించేందుకు ప్రభుత్వం ధాన్య కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జఫర్‌గఢ్ మండలంలోని ఐకేపీల పనితీరు సంతృప్తికరంగా లేదన్నారు. మహిళా సంఘాల రుణాల విషయంలో అవినీతి జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, డీఆర్‌డీఓ పీడీ వసంత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జూలకంటి లావణ్య శిరీష్‌రెడ్డి, డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, మాజీ ఎంపీపీ రడపాక సుదర్శన్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో క్షుద్రపూజల కలకలం

● భయాందోళనలో కాలనీవాసులు



క్షుద్రపూజలు చేసినట్లు అనుమానిస్తున్న ఇంటిని చూపిస్తున్న కాలనీవాసులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ కాలనీలో ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేస్తున్నారనే ప్రచారంతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలనాథ కాలనీలోని 5వ వార్డులో గుగులోతు రమేశ్ దాదాపు 20 ఏళ్ల క్రితం ఇల్లు నిర్మించుకున్నాడు. తర్వాత 12 ఏళ్ల క్రితం ఆ ఇంటిని వదిలి వెళ్లి స్వగ్రామమైన రఘునాథపల్లి మండలం చర్లతండాలో ఉంటున్నాడు. నాటి నుంచి ఆ ఇల్లు ఖాళీగా ఉండడంతో అటువైపుగా ఎవరూ వెళ్లడం లేదు. అయితే గత పదిహేను రోజుల్లో ఆ ఇంటి పక్కన నివాసాలు ఉండే వారు ముగ్గురితోపాటు, కాలనీకి చెందిన మరో ఐదుగురు మృతిచెందారు. నెలరోజుల వ్యవధిలో ఎనిమిది మంది మృతిచెందడంతో ఏదో కీడు జరుగుతుందని కాలనీవాసులు భావిస్తున్నారు. అయితే కొందరు యువకులు శనివారం ఆ ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా.. పసుపు, కుంకుమ, ఖాళీ మద్యం బాటిళ్లు, కోడి, నిమ్మకాయలు ఉండటంతో ఇంటిలో ఎవరో క్షుద్రపూజలు చేస్తున్నారని, అందుకే కాలనీలో అకాల మరణాలు జరుగుతున్నాయని కాలనీవాసులు అభిప్రాయపడుతున్నారు. పదిహేనేళ్ల క్రితం సైతం కాలనీలో ఇలాగే మరణాలు సంభవించాయని అందరూ వనభోజనాలకు వెళ్లాలని వృద్ధులు సూచిస్తుండడం గమనార్హం.

మూఢనమ్మకాలను విశ్వసించొద్దు : సీఐ

మూఢనమ్మకాలను విశ్వసించొద్దని, మంత్రాలు, క్షుద్రపూజలు లాంటివేమి లేవని సీఐ వేణు అన్నారు. అనవసరంగా భయపడుతూ ప్రచారం చేయొద్దని, అందరూ ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఇంటిని శుభ్రం చేయించి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని యజమానిని ఆదేశించారు.

కాంగ్రెస్ పాలనలోనే రైతు రాజ్యం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ శ్వేత

తరిగొప్పుల: కాంగ్రెస్ పాలనలోనే రైతు రాజ్యం నడుస్తుందని, ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత అన్నారు. మండలంలోని అబ్దుల్‌నాగారంలో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి, సుధాకర్, కనుకయ్య, సదయ్య, చంద్రయ్య, ఇంద్రారెడ్డి, పోషిరెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య శ్రీను అంత్యక్రియలు

పాలకుర్తి టౌన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన లకావత్ శ్రీను (25) అంత్యక్రియలు శనివారం పోలీసు బందోబస్తు మధ్య జరిగాయి. పాలకుర్తి మండలం కొండాపురం శివారు మేకల తండాకు చెందిన లకావత్ శ్రీను భార్య కాపురానికి రావడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తూ శుక్రవారం పాలకుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. 75శాతం కాలిన గాయాలతో ఉన్న అతడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్కడి నుంచి శ్రీనివాస్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామం మేకల తండాకు కాకుండా భార్య రాధిక ఊరు నర్సింగాపురం తండాకు లేదా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌కు లేదా ఆత్మహత్యకు కారణమైన దుబ్బతండాకు చెందిన హుస్సేన్ ఇంటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మూడు ప్రాంతాల్లో పికెట్ ఏర్పాటు చేశారు. గూడూరు, బమ్మెర పెద్దతండాలో అదనపు బలగాలను మోహరించి అంబులెన్స్‌ను భారీ పోలీసు ఎస్కార్ట్ నడుమ మేకుల తండాకు తీసుకువెళ్లారు. పోలీసుల బందోబస్తు మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. ఇదిలా ఉండగా.. పాలకుర్తి పోలీస్‌స్టేషన్ ఘటపై జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ సెక్రటరీ ఆదేశాల మేరకు ఆత్మహత్యకు పాల్పడిన స్థలాన్ని పరిశీలించడంతోపాటు బాధితుల కుటుంబ సభ్యులను డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు రవీందర్, శ్రీహరి, జ్యోష్న, పారా లీగల్ వలంటీర్ సాయిలు, సుందరయ్య శనివారం పరామర్శించారు

సబ్‌స్టేషన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

చిల్పూరు: మండలంలోని కొండాపూర్‌లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. డివిజన్ విద్యుత్ డీఈగా బాధ్యతలు చేపట్టిన వై. రాంబాబు హనుమకొండలో ఎమ్మెల్యే శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా కొండాపూర్‌లో విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వపరంగా సాయం అందించాలని కోరగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. అంతేకాకుండా నియోజకవర్గం పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఎక్కడ ఏ ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తేవాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఈ లక్ష్మీనారాయణ, విద్యుత్ ఉద్యోగులు ఉన్నారు.

జోనల్ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

బచ్చన్నపేట : మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు క్రీడాపోటీల్లో జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడలను నిర్వహించగా పలు విభాగాల్లో విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబర్చారని అన్నారు. వరంగల్ జోనల్ స్థాయి పోటీలకు 14 ఏళ్ల విభాగంలో వాణి పాఠశాల నుంచి విద్యార్థి అభిలాష్, ఇటుకాలపల్లి పాఠశాల నుంచి చరణ్, 17 ఏళ్ల విభాగంలో కొన్నె పాఠశాల నుంచి దిలీప్, తుమ్మబాల పాఠశాల నుంచి గౌతమ్‌లు ఎంపికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)